# బ్యాంక్‌లకు గ్యారంటీ, భూస్వాములకు లబ్ధి, బీమా కంపెనీలకు నిధులు-సమకూర్చేదే

## ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం

**'ప్రధానమంత్రి** ఫసల్ బీమా యోజన' పేరుతో (పాత పథకంలో మార్పులు చేసి) ఎన్.డి.ఏ ప్రభుత్వం కొత్త పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. భారత వ్యవసాయ బీమా సంస్థతో పాటు, ప్రైవేట్ బీమా కంపెనీలు కూడా ఈ పథకాన్ని అమలు చేస్తాయని కేంద్ర మంత్రి మండలి ప్రకటించింది. ఇది రైతాంగానికి ఎంతో ప్రయోజనకరమైందని, వారి జీవితాల్లో పెద్ద మార్పులు తీసుకొస్తుందని ప్రధాన మంత్రి చెప్పారు. దేశ చరిత్రలోనే అతి తక్కువ ప్రీమియంతో పంటల బీమా సౌకర్యం కల్పించిన ఘనత మోడీకే దక్కుతుందని, దేశవ్యాపితంగా 19,440 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఈ పథకాన్ని అమలు చేయటానికి 1760 కోట్ల రూపాయల వ్యయమౌతుందని, అందులో సగం కేంద్రప్రభుత్వం, మిగతా సగం రాష్ట్రప్రభుత్వాలు భరిస్తాయని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, వెంకయ్యనాయుడు ప్రకటించారు. ఇంత ఆర్భాటంగా ప్రకటించిన ఈ పథకంలో గత బీమాపథకంలో ఉన్న మౌలిక అంశాల్లోని ఒక్కదాన్ని కూడా మార్చలేదు.

తుపాన్‌లు, వరదలు, భారీ వర్షాలు, దుర్భిక్షం, చీడపీడలు మొదలైన ప్రకృతి వైపరీత్యాల వలన సంభవించే నష్టాలను నియంత్రించే విధానాలు చేపట్టని పాలకులు, వాటి వలన పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవటంలో మొండిచేయి చూపటం వలన అప్పులపాలైన రైతాంగం భూములు అమ్ముకోవాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు. నష్టం పేరుతో బడా పరిశ్రమాధిపతులకు పెద్ద ఎత్తున పరిహారం అందిస్తున్న పాలకులు, రైతాంగం ఎడల అనుసరిస్తున్న విధానాలపై విమర్శలు వెల్లువెత్తటం, రైతులు, రైతు కూలీ సంఘాలు ఆందోళనలు చేపట్టటంతో, పంటలు నష్టపోయిన రైతాంగానికి పరిహారం అందే విధంగా 1972లో పంటల బీమా పథకాన్ని ప్రవేశ పెడుతున్నట్లు కేంద్రపాలకులు ప్రకటించారు.

జాతీయ వ్యవసాయ బీమా సంస్థ ద్వారా 19 బీమా పథకాలు అమల్లో ఉన్నాయి. జీవఇంధన మొక్కలు, యాలుక చెట్లు, కొబ్బరి చెట్లు, ఆలుగడ్డ, కొయ్యగుజ్జు, కాఫీ మొక్కలు, రబ్బరు తోటలకు విడివిడిగా వర్తించే బీమా పథకాలు ఉన్నాయి. ఇవి కాక జాతీయ వ్యవసాయ బీమాపథకం, వాతావరణ బీమా పథకాలు ఉన్నాయి. భారత వ్యవసాయ బీమా సంస్థద్వారా 1985 నుండి 1999 వరకు 'సమగ్ర' వ్యవసాయ బీమా పథకం అమలు జరిగింది.

జాతీయ వ్యవసాయ బీమా పథకంద్వారా వివిధ పంటలకు చెల్లించవలసిన బీమా ప్రీమియంను ప్రకటిస్తూ వస్తున్నాయి. 2009లో బీమా ప్రీమియం చెల్లింపులో చిన్న, సన్నకారు రైతులకు 10 శాతం రాయితీ ప్రకటించింది. దాని ప్రకారం పెద్ద రైతులు ఎకరాకి (పంట ఖర్చు.11,320లకు) 283 రూ॥లు(2.50%) చిన్న, సన్నకారు రైతులకు 254.70రూ॥లు చెల్లించారు. 2009 సం॥ తర్వాత వరి ప్రీమియం రేటును 354రూ, 2012లో 706 రూపాయలుగా ఒక పంటకు బీమా ప్రీమియంను నిర్ణయించారు. వరితోపాటు పెసర, మినుము లాంటి ఆహార పంటలకు కూడా ప్రీమియంను పెంచి, వాణిజ్య పంటలకు మాత్రం తగ్గించారు. మొదట బీమా చెల్లింపు పరిమితిని 50 వేలుగా నిర్ణయించి తర్వాత దాన్ని 2.5లక్షలకు పెంచారు.

బీమా కంపెనీలకు చెల్లించవలసిన ప్రీమియంను రైతులకు యిచ్చే పంట రుణాలనుండి బ్యాంక్‌లు మినహా యిస్తున్నాయి. పంటల బీమా పథకం ఉందని, అందుకోసం తమకు యిస్తున్న రుణం నుండి మినహాయిస్తున్నారని ఇప్పటికే చాలామంది రైతులకు తెలియదు. వారి ప్రమేయం లేకుండానే బ్యాంక్‌లు బీమాపథకంలో రైతులను చేరుస్తున్నాయి. ఏ రైతైనా బీమా పథకంలో చేరటానికి నిరాకరిస్తే అతనికి బ్యాంక్‌లు రుణాలు ఇవ్వటం లేదు. బీమా చేసే దానిలో కూడా మోసం ఉంది. రైతాంగం పండించే మొత్తం పంట విలువకు బీమా చేయటం కాకుండా పంట ఖర్చుకు మాత్రమే పరిమితం చేస్తున్నారు. దాని ఫలితంగా నష్టం జరిగినప్పుడు పంట విలువకు అనుగుణంగా పరిహారం అందక రైతాంగం నష్టపోతున్నారు.

పంటల బీమా పథకాన్ని మొదట మండల స్థాయిలో అమలుపర్చారు. పంటలవారీగా కాలాన్ని నిర్ణయించి నష్టాన్ని అంచనా వేసే విధానాన్ని అమలు పర్చారు. వరి, గోధుమలకు 3 సంవత్సరాలు, మిగతా పంటలకు ఐదు సంవత్సరాల కాల వ్యవధిలో పంట నష్టాన్ని అంచనా వేసి, అందుకు అనుగుణంగా మండలంలోని అత్యధిక గ్రామాల్లో 50% తగ్గకుండా పంట నష్టం జరిగితేనే పరిహారం చెల్లించారు. ఈ విధానంవలన వరుసగా రెండు సంవత్సరాలు రైతాంగం పంటలు నష్టపోయినా, అంతకు సంవత్సరకాల పంట శాతాన్ని కలిసి 50% కన్నా తక్కువ నష్టం జరిగితే రైతులకు ఎటువంటి పరిహారం అందేదికాదు. ఇలాంటి విధానం వలన, చాలా కొద్దిమంది రైతులకే నామమాత్రపు పరిహారం అందింది. బీమా కంపెనీలు, బ్యాంక్‌లు రైతుల సొమ్ముతో పెద్ద ఎత్తున లాభాలు పొందాయి. పంట నష్టం విధానం ఎడల రైతాంగం తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేయటంతో, గ్రామస్థాయిలో పంట నష్టం అంచనా వేయాలన్న డిమాండ్ ముందుకు రావటంతో ప్రభుత్వం అందుకు పరిమితమైన ఆమోదాన్ని తెలిపింది. రాష్ట్రంలోని కొన్ని జిల్లాలకు అదీ ఒక్క పంటకు వర్తింప చేస్తానని, క్రమంగా అన్ని జిల్లాలకు వర్తింప చేస్తానని 2005లో యు.పి.ఏ ప్రభుత్వం ప్రకటించింది.

అందుకు జిల్లాల వారీగా పంటలను నిర్ణయించింది. ఆ పంటలకు తప్ప ఇతర పంటలకు నష్టం జరిగితే గ్రామ యూనిట్ వాటికి వర్తించదు. మండలస్థాయి విధానమే అమలు జరుగుతుంది. ఈ విధానంపైనా రైతాంగంలో తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత వ్యక్తమైంది. దీన్ని చల్లార్చేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒక్కో పంటకు గ్రామ యూనిట్ వర్తింప చేసి పంట నష్టాన్ని అంచనా వేస్తానని చెప్పి దాన్ని అమలు జరపకుండా 2009లో నాలుగు పంటలకే (వరి, వేరుశనగ, మొక్కజొన్న, సోయాబీన్) వర్తింప చేసింది. దీనిపైనా పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తంకావటంతో చివరికి అన్ని జిల్లాలలో ఒక్క పంటను గ్రామ యూనిట్‌కు వర్తింప చేశారు. ఈ విధంగా పంటల బీమా పథకాన్ని అపహాస్యంగా మార్చివేశారు.

బీమా పాలసీ ప్రకారం ఒక కాల పరిమితిలోపు చెల్లించిన ప్రీమియం మొత్తాన్ని నష్టం జరిగినప్పుడు లేదా కాలపరిమితి ముగిసిన వెంటనే బీమాదారునికి అందచేయాలి. ఈ విధానాన్ని పరిశ్రమదారులకు వర్తింప చేస్తున్న పాలకులు, బీమా కంపెనీలు రైతాంగానికి మాత్రం వర్తింప చేయటం లేదు. బీమా ప్రీమియం చెల్లించిన రైతులకు నష్టం జరగక పోయినా పాలసీ ప్రకారం దాన్ని తిరిగి ఇవ్వాలి. బీమా కంపెనీలు అలా చేయకుండా వేలకోట్ల రూపాయల రైతుల సొమ్మును దోచుకుంటున్నాయి.

రాష్ట్రంలో (ఉమ్మడి రాష్ట్రం) కోటి 20 లక్షల మంది రైతులు ఉంటే బీమా చేసిన రైతులు ఐదవ వంతు మాత్రమే ఉన్నారు. వీరిలో 15 శాతానికి మించి పరిహారం అందలేదు. రెండు రాష్ట్రాలుగా ఏర్పడినా ఇప్పటికీ ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. రైతాంగం చెల్లించిన ప్రీమియం మొత్తం కూడా వారికి పరిహారం క్రింద అందటం లేదు. 2007 సంవత్సరంలో ఖరీఫ్-రబీ పంటలకు రైతాంగం చెల్లించిన ప్రీమియం మొత్తంలో 11.45 కోట్లు మాత్రమే చెల్లించారు. 2008 సం॥లో ప్రీమియం క్రింద 98 కోట్ల రూపాయలు చెల్లిస్తే, బీమా కంపెనీలు పరిహారం క్రింద రైతులకు చెల్లించింది 88 కోట్ల రూపాయలు మాత్రమే. ఇది కూడా నష్టపోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతాంగానికి నేరుగా అందించకుండా వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేయటంతో, ఆ డబ్బును తమకు చెల్లించాల్సిన అప్పుక్రింద బ్యాంక్‌లు మినహాయించుకొంటున్నాయి. ఆ తర్వాత మరియు రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత కూడా బీమాకంపెనీల పరిహారపు చెల్లింపులు ఈ విధంగానే ఉన్నాయి. గత రెండు సంవత్సరాలుగా రైతులకు చెల్లించాల్సిన పరిహారపు మొత్తం బ్యాంక్‌ల్లో కూడా జమ కావటం లేదు.

రైతాంగం చెల్లించిన ప్రీమియం మొత్తం కన్నా ఎక్కువ నష్టం జరిగితే దాన్ని కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా చెల్లించేవిధంగా బీమా కంపెనీలతో ఒప్పందం చేసుకొన్నాయి. నిర్ణయించిన ప్రీమియం చెల్లించినప్పుడు ఎంత నష్టం జరిగినా బీమా కంపెనీలే చెల్లించాలి. అందుకు భిన్నంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు యిచ్చేటప్పుడు బీమా కంపెనీలకు ప్రీమియం ఎందుకు చెల్లించాలి? ప్రభుత్వమే ఆ పని చేసి నేరుగా రైతులకే పరిహారం చెల్లించవచ్చు. ఆ విధంగా ఎందుకు చేయటం లేదు? ఇది బీమా కంపెనీలకు లాభం చేకూర్చటం కాదా?!

కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాత పథకాలకు కొత్తపేర్లు పెట్టి దాన్నే కొత్త పథకంగా ప్రచారం చేయటం జరుగుతున్నది. ఎన్.డి.ఏ ప్రభుత్వం తెచ్చిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనా పథకం కూడా అందుకు అనుగుణంగా వచ్చిందే. రెండు పథకాల్లో మౌలికమైన విధానాల్లో ఎటువంటి మార్పులేదు. ప్రీమియం చెల్లింపు, పంట నష్ట శాతంలో కొద్దిపాటి తేడా మాత్రమే ఉంది. ఇదే రైతుల జీవితాల్లో పెద్దమార్పులు తీసుకొస్తుందని ఎన్.డి.ఏ ప్రభుత్వం చెప్పటం రైతాంగాన్ని వంచనకు గురిచేయటమే. ప్రస్తుత బీమా పథకం ప్రకారం వరి,గోధుమ ఇతర ఆహార పంటలకు ఖరీఫ్‌లో 2శాతం, రబీలో 1.5శాతం పంట ఖర్చులకు లోబడి ప్రీమియం చెల్లించాలి. వాణిజ్య పంటలకు 5% ప్రీమియం చెల్లించాలి. మిగతాది కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరిస్తాయి. ఆహార పంటలైన వరి, గోధుమకు ఖరీఫ్ పంటకు ఇంతకు ముందు 706 రూ॥ చెల్లించగా, ఇప్పుడు 500 రూ॥లు ప్రీమియం క్రింద రైతులు చెల్లిస్తే మిగిలిన ప్రీమియంను కేంద్ర-రాష్ట్రప్రభుత్వాలు చెల్లిస్తాయి. కంపెనీలకు చెల్లించే ప్రీమియం మాత్రం తగ్గదు. ప్రీమియం క్రింద కొత్త పథకం ద్వారా 550 రూ॥లు రైతులకు తగ్గుతుంది. దీన్ని ప్రభుత్వాలు నేరుగా కంపెనీలకు చెల్లిస్తాయి. గ్రామ యూనిట్‌గా పంట నష్టాన్ని నిర్ణయించటం, పరిహారం చెల్లింపును 50 నుండి 33 శాతంకి తగ్గించటం, బీమా చేసుకొనే పరిమితిని తొలగించటం, పంట నష్టాన్ని స్మార్ట్ ఫోన్లు ద్వారా పంపటం, రైతుల నుండి ఫిర్యాదు అందిన 5 రోజుల్లో 25 శాతం బ్యాంక్ ఖాతాకి జమ చేయటం, జాతీయ బీమా సంస్థతో పాటు ప్రైవేట్ కంపెనీలను అనుమతించటం కొత్త పథకం విధానంగా ఉంది.

పథకంలోని అంశాలను గమనిస్తే గత, ఇప్పటి పథకాల్లో ముఖ్య నిబంధనలు ఒకే విధంగా ఉన్నాయి. బీమా ప్రీమియం పరిమితిని పంట ఖర్చులకు మాత్రమే వర్తింప చేయటం రెండు పథకాల్లోనూ ఒకే విధంగా ఉంది. పంట నష్టానికి గ్రామాన్ని యూనిట్‌గా పరిగణిస్తామని చెప్పినా కాలపరిమితి ఎడల స్పష్టత లేదు. కాబట్టి గత పథకంలోని కాలపరిమితే ఈ పథకంలోనూ వర్తిస్తుంది. ప్రీమియం మొత్తం కన్నా ఎక్కువ నష్టం జరిగితే కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాలన్న నిబంధన రెండు పథకాల్లోనూ ఒకే విధంగా ఉంది. నష్టం జరగని రైతులకు, వారు చెల్లించిన ప్రీమియం మొత్తాన్ని కంపెనీలు తిరిగి ఇవ్వకుండా వుండేవిధంగా రెండు పథకాల్లో ఉంది. పంటలను బీమా చేసేందుకు జాతీయ బీమా సంస్థతో పాటు ప్రైవేట్ కంపెనీలకు కూడా అవకాశం కల్పించటం ద్వారా పంటల బీమా రంగాన్ని ప్రైవేటీకరించే విధానాలకు కొత్త పథకంలో అవకాశం కల్పించారు. తద్వారా ఆ

సంస్థల దోపిడీకి రైతాంగం గురౌతారు. బీమా మొత్తం పరిమితిని తొలగించటం ద్వారా భూస్వాములకు, ధనిక రైతులకు పరిమితి లేకుండా ఎంత మొత్తానికైనా బీమా చేసుకొని లక్షలాది రూపాయలు పరిహారం పొందే అవకాశం ఎన్.డి.ఏ. పథకంలో కల్పించారు. స్మార్ట్ ఫోన్లద్వారా 5 రోజుల్లో 25% మేర బ్యాంక్‌ల్లో జమ చేసేటట్లు కొత్తపథకంలో చెప్పారు. ఆ తర్వాత అధికారులు పంట నష్టాన్ని నిర్ణయిస్తారని కూడా అందులో పేర్కొన్నారు. ఇంతకు ముందు పథకంలో గాని, ఇప్పటి పథకంలో గాని పంట నష్టాన్ని మాత్రం నిర్ణయించేది కేంద్రం నుండి వచ్చే అధికారులే. పంట నష్టం 25% కన్నా తక్కువగా ఉంటే బ్యాంకుల్లో జమ చేసిన దాని నుండి అంత మేరకు రికవరీ చేసుకోమని పథకంలో చెప్పలేదు. ప్రీమియం చెల్లింపులో రాయితీ ఇవ్వటం కూడా బీమాలో చేరే రైతుల శాతాన్ని పెంచి బీమా సంస్థలకు పెద్ద ఎత్తున నిధులు సమకూర్చి పెట్టేందుకే. వీటన్నిటినీ గమనిస్తే ఎన్.డి.ఏ ప్రభుత్వం ప్రకటించిన బీమా పథకం, రైతుల ప్రయోజనాల కోసం కాదన్నది అర్థమౌతుంది.

యు.పీ.ఏ, ఎన్.డి.ఏ ప్రభుత్వాలు తీసుకొచ్చిన పంట బీమా పథకాలు, అవస్థల్లో వున్న రైతుల ప్రయోజనం కోసం కాకుండా రైతాంగానికి బ్యాంక్‌లు యిచ్చే రుణానికి గ్యారంటీగాను, దుర్భరస్థితిలో వున్న రైతుల నుండి మొత్తాలను పిండుకొని బీమా కంపెనీలు వ్యాపారం చేసుకొనేందుకు, రైతుల నుండి నిధులు సమకూర్చి పెట్టేందుకు ఉద్దేశించినవే. రైతుల ప్రీమియం డబ్బులను బీమా కంపెనీలు వివిధ రూపాలలో అప్పులు ఇస్తూ వడ్డీల ద్వారా కోట్లాది రూపాయలు లాభాలు ఆర్జిస్తున్నాయి.

రైతాంగం పంటలు నష్టపోవటానికి మౌలిక కారణాలను రెండు కూటముల ప్రభుత్వాల విధానాలు ఒకే విధంగా చెబుతున్నాయి. ఆ సమస్యల పరిష్కారం జోలికే అవి వెళ్లటం లేదు. సేద్యానికి అవసరమైన సాగునీరు అందించే విధంగా రిజర్వాయర్లు, ప్రాజెక్టులు అవసరమైన మేరకు నిర్మించి వర్షం, వరదల నీటిని నిల్వచేసే విధానాలు ఉద్దేశపూర్వకంగానే విస్మరించారు. ఫలితంగా దేశంలోనూ, రాష్ట్రంలోనూ అనేక ప్రాంతాల్లో వర్షాధారంపైనే సేద్యం సాగుతున్నది. దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడినప్పుడు పంటలకు తీవ్ర నష్టం జరుగుతున్నది. వరదలు వర్షపు ముంపుకి గురై రైతాంగం పెద్దఎత్తున పంటలు నష్టపోతున్నారు. దేశ వివిధ ప్రాంతాల వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన, తెగుళ్ళను తట్టుకొనే విధంగా విత్తన ఉత్పత్తి చేయకుండా, సస్యవిప్లవం, అధిక దిగుబడుల పేరుతో విదేశీ హైబ్రీడ్ విత్తనాలను దిగుమతి చేసుకోవటం వలన వాటినుండి వచ్చే కొత్త తెగుళ్ళు పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరల పెరుగుదల వలన పంట ఖర్చులు పెరగటం, అందుకు అనుగుణంగా పంటలకు న్యాయమైన ధరలు, మార్కెట్ సౌకర్యం లేకపోవటం వలన కూడా రైతుల సేద్యం నష్టదాయకంగా మారింది. ఈ సమస్యలు పరిష్కారమైతే ప్రకృతి వైపరీత్యాల నష్టాలను నియంత్రించటంతోపాటు, సేద్యం రైతులకు లాభసాటిగా మారుతుంది. ఈ విధానాలు అమలు పరచని పాలకులు పంటల బీమాలాంటి పథకాలతో రైతాంగాన్ని మభ్యపెడుతున్నారు.

పంటల బీమా పథకాలు ప్రవేశపెట్టటంలోని అసలు ఉద్దేశ్యాన్ని రైతులు గ్రహించాలి. పంట విలువ మొత్తానికి బీమాని వర్తింప చేయాలని, నష్టానికి పూర్తి పరిహారం చెల్లించాలని, బీమా కంపెనీల దోపిడీని అరికట్టి, ప్రభుత్వమే నేరుగా రైతులకు పరిహారం ఇవ్వాలని, పరిహారం పొందని రైతులకు, వారు చెల్లించిన ప్రీమియం తిరిగి ఇవ్వాలని, పంటలకు న్యాయమైన ధరలు చెల్లించాలని, కరువు నివారణ, ముంపు నియంత్రణకు, నీటి నిల్వకోసం రిజర్వాయర్లు, ప్రాజెక్టులు నిర్మించాలని, దేశ పరిస్థితులకు అనుగుణంగా విత్తన ఉత్పత్తి చేసి తెగుళ్ళ నష్టాన్ని తగ్గించాలని డిమాండ్‌చేస్తూ యావన్మంది రైతాంగం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి.

ooooooo